మల్లన్న కల్యాణానికి చకచకా ఏర్పాట్లు

జనవరి 7న కల్యాణోత్సవం.. 8న పెద్దపట్నం

చేర్యాల, డిసెంబర్ 22: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు నెలవైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయవర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. పెండ్లి పత్రికలు, కల్యాణ మహోత్సవం, బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను ఇప్పటికే సిద్ధం చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు ప్రముఖులకు ఆహ్వానపత్రికలను అందిస్తున్నారు. ప్రతి ఏడాది మార్గశిరమాసం చివరి ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవాలు ప్రారంభమై పాల్గుణ మాసం చివరి ఆదివారం అగ్నిగుండాలతో ముగుస్తాయి. వచ్చే ఏడాది జనవరి 7వ తేదీన స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. 2023లో అధికమాసం రావడంతో ప్రతి ఏటా డిసెంబర్‌లో నిర్వహించే స్వామి కల్యాణోత్సం ఈసారి జనవరి మొదటి వారంలో జరుగనుంది.

31 రోజుల పాటు ఉత్సవాలు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఉత్సవాలు జనవరి 7న నిర్వహించే కల్యాణోత్సవంతో ప్రారంభమై ఏప్రిల్ 8వ తేదీన నిర్వహించే అగ్నిగుండాల కార్యక్రమంతో ముగుస్తాయి. ఈ ఏడాది 12 వారాల (ఆదివారాలు)పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. గతేడాది తొమ్మిది వారాల పాటు ఉత్సవాలు నిర్వహించగా ఆలయ సంప్రదాయం, ఆగమశాస్త్రం ప్రకారం ఈ ఏడాది 12 వారాలు కొనసాగించాలని ఆలయ అర్చకులు నిర్ణయించారు. 7న కల్యాణోత్సం, మార్చి 8న స్వామి వారి పెద్దపట్నం, ఏప్రిల్ 8న అగ్నిగుండాల కార్యక్రమాలు జరుగున్నాయి. ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని ఆలయవర్గాలు వెల్లడించాయి.

కొమురవెల్లి మల్లికార్జున స్వామి, కల్యాణ ఆహ్వానపత్రిక

ప్రముఖులకు ఆహ్వానం

చేర్యాల, డిసెంబర్ 22: మల్లన్న క్షేత్రంలో జనవరి 7న నిర్వహించే కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవానికి హాజరుకావాలని కోరుతూ శుక్రవారం ఆలయ ఈవో ఏ.బాలాజీ ఆధ్వర్యంలో అర్చకులు మంత్రి, ఎమ్మెల్యేలకు ఆహ్వానపత్రికలు అందజేశారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డిలకు హైదరాబాద్‌లోని వారి కార్యాలయాలు, నివాసంలో మల్లన్న ఆలయ ఈవో ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణ ఆహ్వానపత్రికను అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో స్వామి వారి కల్యాణోత్సవ ఏర్పాట్లపై మంత్రి, ఎమ్మెల్యేతో చర్చించారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌తో కలిసి స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందించనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో ఆలయ స్థాన చార్యుడు పడిగన్నగారి మల్లేశం, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు పడిగన్నగారి ఆంజనేయులు, ఆకుల విజయ్‌కుమార్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకులు, ఈవో

మంత్రి కొండా సురేఖకు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఈవో, అర్చకులు

కళలకు కాణాచి సిద్దిపేట

నృత్యం చేస్తున్న జానపద కళాకారులు

సిద్దిపేట, డిసెంబర్ 22: సిద్దిపేట కళలకు కాణాచి అని, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిఒక్కరూ ఆచరిస్తూ ముందుకు సాగాలని సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శాడ సత్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువజన సంక్షేమ, క్రీడల శాఖ అధికారి జొన్నల నాగేందర్ అధ్యక్షతన యువజనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శాడ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట ఖ్యాతిని యువత జాతీయ స్థాయిలో నిలపాలన్నారు. దేశంలో యువత ప్రాధాన్యం అమోఘమన్నారు. యువతలో దాగిఉన్న శక్తిని వెలికితీయడానికి ఇలాంటి యువజన ఉత్సవాలు ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం జాతీయ యువజన అవార్డు గ్రహీత, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు దేశబోయిని నర్సింహులు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన యువజన పాలసీని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో ఎంపికైన ఎనిమిది విభాగాల వారిని రాష్ట్ర స్థాయిలో నిర్వహించే యువజనోత్సవలకు పంపించనున్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర అకౌంటెంట్ కిరణ్‌కుమార్, యువజన అవార్డు గ్రహీతలు సుభాష్ చంద్రబోస్, అధికం రాజు, న్యాయ నిర్ణేతలు బాలకిషన్, మహేందర్, ముక్కపల్లి శ్రీనివాస్, స్వామి కన్నా, యువజన సంక్షేమ శాఖ సిబ్బంది శ్రీనివాస్ గౌడ్, నాగార్జున, ప్రవీణ్, జైన్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో క్రీడాకారుల ఎంపిక

ఎంపికైన ఉమ్మడి మెదక్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 22: జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన అండర్ 17 బాల, బాలికల వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను శుక్రవారం శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి అమూల్యమ్మ మాట్లాడుతూ అండర్-17 విభాగంలో దాదాపు 150 మంది క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరయ్యారని తెలిపారు. ఇందులో 17 మంది బాల బాలికలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు షర్పోద్దీన్, రామాగౌడ్, రామకృష్ణ, రాజాగౌడ్, సుభాష్‌గౌడ్, దుర్గాప్రసాద్, తేజేందర్, దత్తు పాల్గొన్నారు.

పత్తిసాగులో తెలంగాణ ఆదర్శం

మర్కూక్, డిసెంబర్ 22: పత్తిసాగులో తెలంగాణ దేశంలోనే మూడోస్థానం సాధించడం అభినందనీయమని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ నల్కర్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో కిసాన్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తిసాగులో మెలకువలు, అధిక దిగుబడి, అధికసాంద్రత పద్ధతిలో పత్తిసాగు విధానంపై మాట్లాడారు. వ్యవసాయ అధికారి డాక్టర్ శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏవో నాగేందర్‌రెడ్డి, వసంతరావు, కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రవి, ప్రతాపరెడ్డి, మండల సహాయ విస్తరణ అధికారి విష్ణువర్ధన్, రైతులు పాల్గొన్నారు.

బీవీఆర్‌ఐటీలో టెక్నికల్ ఫెస్ట్

ప్రహ్లాదరావుకు జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల సెక్రటరీ ఆదిత్య

నర్సాపూర్, డిసెంబర్ 22: నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ ఐటీ కళాశాలలో టెక్నికల్ ఫెస్ట్‌లో భాగంగా ప్రొమోథియన్ 2K23 ని శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టాటా టెక్నాలజీ ప్రెసిడెంట్ ప్రహ్లాదరావు హాజరై టెక్నాలజీ ప్రాముఖ్యతను వివరించారు. 100కు పైగా టెక్నికల్ ఈవెంట్స్, వర్క్‌షాప్ నిర్వహించారు. రెండు రోజులపాటు ఈ సదస్సు నిర్వహిస్తామని యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో ఎస్‌వీఈఎస్ సెక్రటరీ ఆదిత్య, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

నేడు మెదక్ జడ్పీ సర్వసభ్య సమావేశం

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 22: మెదక్ జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శైలేశ్‌వెంకట్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని పేర్కొన్నారు.

యువ శక్తితోనే దేశ ప్రగతి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 22: యువ శక్తితోనే దేశ ప్రగతి అని, యువత చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. 27వ జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొనే జిల్లా స్థాయి యువ కళాకారుల ఎంపిక పోటీలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైస్‌రాయ్ గార్డెన్‌లో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు, సాంస్కృతిక రంగాలు యువతకు పునాది లాంటివని, ప్రతీఒక్కరికి మాతృభూమిపై ప్రేమ, గౌరవం ఉండాలన్నారు. రాష్ట్రంలోనే యువ ఓటు హక్కు వినియోగంలో మెదక్ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు, యువతీ, యువకులు నృత్యాలు, ఆలపించిన పాటలు అందరిలో జోష్ నింపాయి. జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ, అంజాగౌడ్ పాల్గొన్నారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు

అక్షింతలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, యువకులు

పుల్కల్, డిసెంబర్ 22: జనవరి 22న నిర్వహించే అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని అయోధ్యలో పూజ చేసిన అక్షింతలను ఇంటింటికీ అందజేయాలనే ఉద్దేశంతో గురువారం రాత్రి మండల కేంద్రమైన పుల్కల్ హనుమాన్ ఆలయానికి వచ్చిన అక్షింతలకు పూజ నిర్వహించి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయం నుంచి యువకులు పెద్దఎత్తున రామ నామం జపిస్తూ ర్యాలీ చేపట్టారు. అక్షింతలను గ్రామంలో జనవరి 1వ నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికీ అందజేయాలని బజరంగ్‌దళ్ నాయకులు సూచించారు. 22న విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న సమయంలో బాలరాముడిని స్మరిస్తూ తలపై అక్షింతలు వేసుకోవాలన్నారు. ర్యాలీలో బజరంగ్‌దళ్ నాయకులు సుభాష్‌చందర్, మహేశ్, రాజశేఖర్, సర్పంచ్ శ్రవణ్‌కుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి, మాజీ సర్పంచ్ కమల్ రెడ్డి, అంజయ్య, రాజు, మహేశ్, కరుణాకర్ పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు 48 మంది ఎంపిక

ఖేలో ఇండియా రాష్ట్ర రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చేగుంట, డిసెంబర్ 22: ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు పలువురు క్రీడాకారిణులు ఎంపికైనట్లు కోచ్ కరణం గణేశ్‌రవికుమార్ శుక్రవారం తెలిపారు. మండలకేంద్రమైన చేగుంటలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఖేలో ఇండియా పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వంద మందికిపైగా క్రీడాకారిణులు పాల్గొన్నారు. అండర్ 14, 18 జూనియర్, సీనియర్ విభాగాల్లో 48 మంది క్రీడాకారిణులు ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారని కోచ్ కరణం గణేశ్ రవికుమార్ తెలిపారు. ఎంపికైన అండర్ 18 సీనియర్ మహిళా జట్లు 23న సికింద్రాబాద్‌లోని ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్‌సాత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 6.30 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నేషనల్ రగ్బీ రెఫరీ కర్ణం మల్లీశ్వరీ, జిల్లా పీటీల అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, పీడీలు శారాధ, వెంకటేశ్, మంజుల, నర్సింహులు, పీఈటీ బాలరాజ్ తదితరులున్నారు.